# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 08-11-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. విజయవాడ నుంచి శ్రీశైలం మధ్య 'సీ ప్లేన్' సేవలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రేపు ప్రారంభించనున్నారు.**

**2. షెడ్యూల్ కులాల జనాభా దామాషా ప్రకారం జిల్లా యూనిట్‌గా వర్గీకరణ అమలు చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు.**

**3. గత ప్రభుత్వ బకాయిలను దశలవారీగా విడుదల చేస్తామని, రహదారుల మరమ్మతుల నిర్వహణలో సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని కాంట్రాక్టర్లకు రహదారులు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి స్పష్టం చేశారు.**

**4. రాష్ట్రంలోని దేవదాయశాఖ పరిధిలో 500 ఉద్యోగాలను భర్తీ చేస్తామని ఆ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు.**

**5. రాబోయే ఐదు సంవత్సరాల్లో రాష్ట్రంలో విద్యా విధానం దేశానికే తలమానికంగా ఉండే విధంగా మార్పులు తీసుకువస్తామని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు.**

**==========================**

విజయవాడ నుంచి శ్రీశైలం మధ్య 'సీ ప్లేన్' సేవలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రేపు ప్రారంభించనున్నారు. రాష్ట్రాన్ని పర్యాటకంగా, సాంకేతికంగా బలోపేతం చేసే చర్యల్లో భాగంగా ప్రయోగాత్మకంగా సీప్లేన్ సేవలను ప్రారంభిస్తున్నారు. విజయవాడలోని పున్నమిఘాట్ నుంచి ఈ సేవలను ప్రారంభించనున్న ముఖ్యమంత్రి సీప్లేన్‌లో శ్రీశైలం వెళతారు. భ్రమరాంబ, మల్లికార్జునస్వామిని దర్శించుకుంటారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

-------------------------

షెడ్యూల్ కులాల వర్గీకరణ అమలుపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎస్సీ జనాభా దామాషా ప్రకారం జిల్లా యూనిట్‌గా వర్గీకరణ అమలు చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అధ్యయనానికి త్వరలో కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అమలుకు కార్యచరణ, దళితుల సంక్షేమం, అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, తెలుగుదేశం, జనసేన దళిత ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సచివాలయంలో నిన్న సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ నోటిఫికేషన్ల విడుదలలో జాప్యం

లేకుండా నెల రోజుల్లోపే నివేదిక అందించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. వర్గీకరణ అమలు ద్వారా దళితుల్లోని ఉపకులాలందరికీ సమాన అవకాశాలు కల్పించి వారికి ఊతమిచ్చేలా పనిచేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు.

---------------------------

ఉగ్రవాద నిర్మూలనకు త్వరలో జాతీయ విధానాన్ని తీసుకు వస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. ఢిల్లీలో నిన్న ఆయన 'ఉగ్రవాద వ్యతిరేక సదస్సు-2024'ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. శాంతిభద్రతలు రాష్ట్రానికి సంబంధించిన విషయమని.. రాష్ట్రాలకు భౌగోళిక సరిహద్దులు, రాజ్యాంగ పరిమితులు ఉన్నప్పటికీ ఉగ్రవాదానికి ఎల్లలు లేవని తెలిపారు. అందువల్ల అన్ని భద్రతా సంస్థలు, కేంద్రం-రాష్ట్రాలు కలిసి ఉగ్రవాదంపై పోరాడాలని సూచించారు. ఉమ్మడి వ్యూహాలను పంచుకుని.. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దాలన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ సంకల్పాన్ని సాకారం చేయడానికి ఏకీకృత ఉగ్రవాద పోరాట వ్యవస్థ కలిగి ఉండాలని స్పష్టంచేశారు.

---------------------------

ఉమ్మడి గుంటూరు జిల్లాలో రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నిన్న రాత్రి చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లో రేషన్ బియ్యం అక్రమ నిల్వలు వెలుగుచూశాయి. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఏడు ప్రాంతాల్లోని రైస్ మిల్లుల్లో మంత్రి తనిఖీలు నిర్వహించారు. భారీగా ప్రజా పంపిణీ బియ్యం నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. మంత్రి ఆదేశాల మేరకు అధికారులు మిల్లుల నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ప్రజలకు చేరవలసిన నిత్యావసర వస్తువులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి మనోహర్ వివరిస్తూ...

....వాయిస్... 37 సెకన్లు

---------------------------

గత ప్రభుత్వ బకాయిలను దశలవారీగా విడుదల చేస్తామని రహదారుల కాంట్రాక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. పనుల నిర్వహణలో తలెత్తే సాంకేతిక, ఇతర సమస్యలను కూడా సత్వర మే పరిష్కరిస్తామని స్పష్టం చేసింది. 13 ఉమ్మడి జిల్లాల ఎన్‌డీబీ రహదారుల గుత్తేదారులతో రోడ్డు భవనాల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ కార్యాలయంలో ఆ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్.. ఎన్‌డీబీ రుణంతో విస్తరిస్తున్న రహదారుల పనులకు సంబంధించి 225 కోట్ల 46 లక్షల రూపాయల బకాయిలను ప్రభుత్వం ఇటీవలే చెల్లించిందని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని దేవదాయశాఖ పరిధిలో 500 ఉద్యోగాలను భర్తీ చేస్తామని ఆ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. దీంతోపాటు అన్ని ఆలయాల ట్రస్ట్‌బోర్డుల నియామకాలు చేపడతామన్నారు. దేవదాయశాఖ కమిషనరేట్‌లో అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయాల్లో ప్రసాదాలు, అన్నప్రసాదాల తయారీలో ఏ-గ్రేడ్ రకం సరకులే వినియోగించాలని ఆదేశించారు. పారిశుధ్య పనులు, భద్రతా ఏర్పాట్లు, ఇతర విభాగాల్లో మానవ వనరుల వినియోగానికి సంబంధించి కేంద్రీకృత విధానం తీసుకొచ్చేలా కసరత్తు చేస్తున్నామని వెల్లడించారు.

---------------------------

రాబోయే ఐదు సంవత్సరాల్లో రాష్ట్రంలో విద్యా విధానం దేశానికే తలమానికంగా ఉండే విధంగా మార్పులు

తీసుకువస్తామని మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. రాజధాని అమరావతిలోని వీఐటీ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ విద్యా సదస్సును నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 50కి పైగా ప్రముఖ అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు వికసిత్ భారత్ స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేసేందుకు వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047 వైపు అడుగులు వేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఉద్యోగాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని లోకేష్ వివరిస్తూ...

....వాయిస్... 30 సెకన్లు

---------------------------

పండుగ రద్దీకి అనుగుణంగా దక్షిణమధ్య రైల్వే ఈ రోజు 33 ప్రత్యేక రైళ్లు నడుపుతోంది. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా తిరుపతి– మచిలీపట్నం, తిరుపతి– సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైళ్లు అందుబాటులో ఉండనున్నాయి. కాకినాడ–లింగంపల్లి, నర్సాపూర్– బెంగళూరు, సికింద్రాబాద్– విశాఖపట్నం మధ్య కూడా ప్రత్యేక రైళ్లు ఇవాళ సేవలు అందించనున్నాయి. విజయవాడ– విశాఖపట్నం, విశాఖపట్నం– విజయవాడ మధ్య 2 ప్రత్యేక రైళ్లు నడవనున్నాయి. తిరుపతి– షోలాపూర్ మధ్య కూడా ప్రత్యేక రైలును అందుబాటులోకి తీసుకొచ్చామని రైల్వే అధికారులు వెల్లడించారు.

---------------------------

రైలు ప్రమాదాలు జరిగినపుడు ప్రయాణికులను రక్షించడం, ట్రాక్ పునరుద్దరణ  చర్యలపై వాల్తేర్ రైల్వే డివిజన్ పరిధిలోని సింహాచలం రైల్వే స్టేషన్‌లో ఈరోజు మాక్ డ్రిల్ నిర్వహించారు. డివిజినల్ రైల్వే మేనేజర్ సౌరభ్ కుమార్ ప్రసాద్ పర్యవేక్షణలో దాదాపు మూడు గంటల పాటు మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి మరిన్ని వివరాలు మా ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగం విశాఖపట్నం ప్రతినిధి వి.సత్యనారాయణ మూర్తి అందిస్తారు.

వాయిస్ (40 సెకన్లు)

---------------------------

ఏలూరు జిల్లాలో నిర్మిస్తున్న బహుళార్థసాధక పోలవరం ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న పాత డయాఫ్రం వాల్‌కు ఎగువన 6 మీటర్ల దూరంలో కొత్త డయాఫ్రం వాల్ నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. నిన్న జరిగిన చర్చల్లో ఈ విషయాన్ని సూత్రప్రాయంగా ఆమోదించారు. పోలవరం ప్రాజెక్టు వద్ద మేధోమథనంలో కొత్త డయాఫ్రం వాల్ డిజైన్లపై, నిర్మాణ షెడ్యూలుపై చర్చించారు. కేంద్ర జలసంఘం చీఫ్ ఇంజనీర్ విజయ్ శరణ్ అధ్యక్షతన కేంద్ర, రాష్ట్ర అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు ఈ చర్చల్లో పాల్గొన్నారు.

---------------------------

గుజరాత్‌లోని నరేంద్రమోదీ క్రికెట్ స్టేడియం తరహాలో రాష్ట్రంలోని విశాఖపట్నం, మంగళగిరి క్రికెట్ మైదానాల్లో మార్పులు చేయబోతున్నామని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్.. ఏసీఏ అధ్యక్షులు, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ తెలిపారు. వీటిలో అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఆయన అధ్యక్షతన ఏసీఏ ఎపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధికి సంబంధించి 16 అంశాలపై సమావేశంలో చర్చించారు.

=====================